

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి 6లో..

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు 6లో..

మత్తు.. చిత్తు



- జిల్లాలో వాడవాడలా గంజాయి విక్రయాలు
- మత్తుకు బానిసవుతున్న యువత
- కోల్‌బెల్ట్‌లో 2వేలకు పైగా మంది బాధితులు
- ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి సరఫరా

కోల్‌సిటీ, జూన్ 19: జిల్లాలో వాడవాడలా గంజాయి వ్యాపారం పాకిపోయింది. మత్తుకు బానిసలైన వారు విక్రయదారులుగా కొత్త అవతారమెత్తుతున్నారు. తమ వ్యాపారానికి విద్యార్థులు, యువకులను వాడుకుంటున్నారు. ముఖ్యంగా విద్యార్థులనే టార్గెట్ చేస్తున్నారు. గంజాయికి బానిసలైన విద్యార్థుల ద్వారానే తోటి విద్యార్థులకు వల వేస్తు న్నారు. ఒక్కసారి పీల్చితే చాలు జీవితం నాశనమయ్యే పరిస్థితి ఏర్ప డింది. కోల్‌బెల్ట్‌లో గంజాయి వ్యాపారం కోట్లలో సాగుతోంది. వ్యాపారం విస్తరించిన కొద్దీ బాధితులు పెరుగుతున్నారు. జిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతంలోనే రెండువేలమందికి పైగా బాధితులు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు.

● పట్టుబడేది బాధితులే...

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గంజాయి పట్టుబడిన సందర్భాల్లో ఎక్కువగా ఆ మహమ్మారికి బానిసలైన బాధితులే ఎక్కువగా ఉంటున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన స్మగ్లర్లు, డీలర్లు ఉన్నట్టు పోలీస్ శాఖలోనే చర్చ జరుగుతోంది. కీలకమైన వ్యక్తులు పట్టుబడిన సందర్భాలు మాత్రం లేవు. గంజాయి నుంచి గంజాయి చాక్లెట్లు, హష్‌ఆయిల్ వరకు జిల్లాలో వ్యాపారం సాగుతోంది. ఎన్‌టీపీసీలోని ఒక గంజాయి వ్యాపారి అయితే తన స్థావరంలో పెద్దసంఖ్యలో కుక్కలను కాపాలా పెడుతూ అక్కడికి ఎవరూ రాకుండా కట్టడి చేస్తున్నట్టు ప్రచారంలో ఉంది. విఠల్‌నగర్, ఫైటింక్లయిన్‌కాలనీ, గోదావరిఖని హనమాన్‌నగర్, సిక్ హాస్పిటల్ ఏరియా ప్రాంతాల్లో కొందరు డీలర్లు ఈ వ్యాపారాన్ని సాగిస్తున్నట్టు ప్రచారంలో ఉంది. కోట్లలో సాగుతున్న ఈ దందాలో అదే స్థాయిలో డబ్బులు చేతులు కూడా మారుతున్నాయనే ప్రచారం ఉంది.

● విద్యార్థులే టార్గెట్..

విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి స్మగ్లర్లు వ్యాపారాలు సాగిస్తున్నారు. గతంలో జులా యిలు, కళాశాల స్థాయి విద్యార్థులు, యువతే లక్ష్యంగా అమ్మకాలు జరిగేవి. ఇప్పుడు పరిస్థితి మరింత దిగజారింది. 9, 10 తర గతులు చదివే విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని బాలలను సైతం మత్తులోకి దించుతున్నట్టు తెలుస్తోంది. గోదావరిఖని పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న కొందరు విద్యార్థులు గంజాయికి బానిసల వడంతో ఉపా ధ్యాయులు వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చిన సందర్భంగా వివాదాలు సైతం చోటు చేసుకున్నాయి.

● కట్టడే మార్గం..

జిల్లాలో గంజాయి లభించకుండా కట్టడి చేయడమే నివారణకు మార్గమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎక్కడపడితే అక్కడ గంజాయి దొరకడం వల్ల దానికి బానిసలవుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. గ్రామాల్లో సైతం గంజాయి లభిస్తుందంటే పరిస్థితులు ఏ స్థాయికి దిగజారాయో అర్థం చేసుకోవచ్చు. పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా రైలు, రోడ్డు మార్గాల ద్వారా రవాణా కాకుండా కట్టడి చేస్తేనే గంజాయికి అడ్డుకట్ట పడుతుంది.

● ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి సరఫరా..

ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు, విశాఖపట్నం, ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని రావాణా చేస్తున్నారు. మహారాష్ట్ర తూర్పు ప్రాంతంలోని గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతాల నుంచి కూడా రవాణా అవుతోంది. గంజాయి రవాణాకు స్మగ్లర్లు వివిధ మార్గాలను ఎన్నుకుంటున్నారు. విశాఖ ఏజెన్సీ నుంచి ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల మీదుగా కోల్‌బెల్ట్‌కు తెప్పిస్తున్నారు. రామగుండం ప్రాంతంలోని గోదావరిఖని, ఫైటింక్లయిన్ కాలనీ, ఎన్‌టీపీసీ, రామగుండం, పెద్దపల్లి ప్రాంతాల్లో గంజాయి వ్యాపారులు పెద్దఎత్తున తెప్పించి తమ ఏజెంట్ల ద్వారా విక్రయాలు జరుపుతున్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఫైటింక్లయిన్‌కాలనీ, రాజీవ్‌నగర్ లంబడి తండా, పెద్దంపేట, సంతోష్‌నగర్, గోదావరిఖనిలోని విఠల్‌నగర్, సిక్ హాస్పిటల్ ఏరియా, హనుమాన్ నగర్, ఉదయ్‌నగర్ ప్రాంతాల్లో గంజాయి విక్రయాల డీలర్లు ఉన్నారు. ఎన్‌టీపీసీ పీకే రామయ్య క్యాంపు, రామగుండం స్టేషన్ ఏరియా, హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రాంతాల్లో స్థావరాలు ఉన్నట్టు తెలుస్తోంది. కిలోల కొద్దీ గంజాయిని తెప్పించి చిన్నచిన్న ప్యాకెట్ల ద్వారా విక్రయిస్తున్నారు. రాత్రి 10గంటల తరువాత తెల్లవారుజాము వరకు ఈ విక్రయాలు సాగుతున్నట్టు తెలుస్తున్నది.

రక్తహీనత నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్

పెద్దపల్లిటౌన్, జూన్ 19: సికిల్ సెల్ అనీమియా(రక్తహీనత) నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.ప్రమోద్‌కుమార్ వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు గిరిజన సంక్షేమ శాఖ, వైద్యారోగ్య శాఖ సంయుక్తంగా జిల్లాస్థాయి సికిల్ సెల్ వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం పురస్కరించుకొని భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్య విభాగం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సమన్వయంతో సికిల్ సెల్ మిషన్ 2047 నాటికి దేశాన్ని సికిల్ సెల్ అనీమియా నుంచి విముక్తి చేయడానికి ఒక మిషన్ ప్రకటించిందని, ఇందులో అవగాహన కల్పించడం, ప్రభావిత గిరిజన ప్రాంతాల్లోని 40 సంవత్సరాల వయస్సులోపు మొత్తం 7 కోట్ల మందికి పరీక్షలు చేయడం కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రయత్నాల ద్వారా రోగులకు చికిత్స అందించడం జరుగుతుందన్నారు. సికిల్ సెల్ వ్యాధి అనేది ఒక జన్యుకారక వ్యాధి అని, సికిల్ కణాల దృఢత్వం, అసాధారణ ఆకారం శరీరంలోని చిన్న రక్తనాళాల ద్వారా కదిలే సామర్థ్యాన్ని తగ్గిస్తుందని, ఇది రక్త ప్రసరణలో అడ్డంకిని కలిగిస్తుందని అన్నారు. సికిల్ సెల్స్‌లో ఆక్సిజన్ మోసుకొని వెళ్లే సామార్థ్యం తగ్గిపోవడం వలన, ఆక్సిజన్ తగినంత మొత్తంలో లేకపోవడం వలన శరీరంలోని ఏదైనా భాగంలో కణజాలం అవయవ నష్టం జరగవచ్చని తెలిపారు. సికిల్ సెల్ అనీమియా వ్యాధిని రక్త కణాల తగ్గుదల(రక్తహీనత), కళ్ళు పసుపు రంగులోకి మారడం, శరీరం, కీళ్లలో తీవ్రమైన నొప్పులు, ఊపిరి ఆడకపోవడం, ఆయాసం, పునరావృత అంటు వ్యాధులు, గర్భధారణ సమయంలో అవయవ నష్టం వంటి లక్షణాల ద్వారా గుర్తించవచ్చన్నారు. సికిల్‌సెల్ వ్యాధి వస్తే భయపడాల్సిన అవసరం లేదని, జిల్లాలోని మీ సమీప ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యాధికారిని సంప్రందించి వారు చెప్పిన విధంగా మందులు వాడితే తగ్గుతుందని, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక కేంద్రాలు, సబ్ సెంటర్లలో వీటిపై క్యాంపులు అవగాహన సదస్సులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి డి.జనార్దన్ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోగల గిరిజన నివాసాలలో గల కుంటుంబాలకు జూన్ 20 నుంచి జూలై 07 వరకు వరకు అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం గడువు పొడిగింపు

పెద్దపల్లిటౌన్, జూన్ 19: పెద్దపల్లి మున్సిపాలిటీ తైబజార్ వేలం ఈనెల 19న నిర్వహించాల్సి ఉండగా, ఈనెల 22 వరకు పొడిగించినట్లు మున్సిపల్ మేనేజర్ మేనేజర్ శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే రావడంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడే పరిస్థితులున్న నేపథ్యంలో 22వరకు పొడిగించినట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 20జూన్ 2024 నుంచి 31మార్చి 2025 వరకు తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం ఈనెల 22లోపు ఆసక్తిగల కాంట్రాక్టర్లు 50 వేల రూపాయల డిపాజిట్‌తో మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీకి ఎలాంటి పన్నులు బకాయిలున్న ఈ వేలానికి అనర్హులని, వేలం పాటలో తైబజార్ దక్కించుకున్నవారు మూడు రోజుల్లో పాటలో 50 శాతం కార్యాలయంలో డిపాజిట్ చేయాలని, అలాగే 25 శాతం డిసెంబరు ఆఖరిలోగా, మిగతా 25 శాతం ఫిబ్రవరి చివరికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. 9 నెలలపాటు కాలం ఉంటుందని, తైబజార్ దక్కించుకున్న వారి దరఖాస్తుతో డిపాజిట్ చేసిన 50 వేల రూపాయలు తిరిగి ఇవ్వబడదని, వేలం దక్కని వారి డిపాజిట్ తిరిగి ఇవ్వబడుతుందన్నారు. ఏలాంటి కారణాలు, అడ్డంకులు వచ్చిన వారి వారసత్వం మున్సిపాల్టీకి చెల్లించాల్సిన మొత్తం చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమస్తే తైబజార్ కాంట్రాక్ట్ రద్దు చేయబడుతుందని తెలిపారు.

సిబ్బంది జవాబుదారీతనంతో పనిచేయాలి

రామగుండం కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ, జూన్ 19: కార్యాలయ ప్రతిష్ట పెంచే విధంగా సిబ్బంది జవాబుదారీతనంతో పని చేయాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సూచించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమయ పాలన పాటిస్తూ ప్రజాపాలన దరఖాస్తులు, వివిధ సమస్యల పరిష్కారానికి కార్యాలయానికి విచ్చేసే వారితో మర్యాద పూర్వకంగా మాట్లాడుతూ వెంటనే స్పందించి సేవలందించాలన్నారు. ఆస్తి పన్ను వసూళ్లు, నల్లా బిల్లుల వసూళ్లు పెంచాలని అన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. నగరంలో ఎక్కడా చెత్త పేరుకు పోకుండా పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పని స్థలాల్లో మహిళల రక్షణ కొరకు మహిళా ఉద్యోగుల కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఈ చిన్నారావు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సెక్రెటరీ రాజు, ఏసీపీ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ మనోహర్, అకౌంట్స్ ఆఫీసర్ అర్చన, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ పాల్గొన్నారు.

బస్సులో దొరికిన బంగారం

కళ్యాణ్‌నగర్, జూన్ 19: హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి వస్తున్న ఆర్‌టీసీ బస్సులో 10తులాల బంగారాన్ని కండక్టర్ గుర్తించి డిపో మేనేజర్‌కు అప్పగించారు. హైదరాబాద్ జేబీఎస్ నుంచి మధ్యాహ్నం 2గంటలకు బయలుదేరిన ఆర్‌టీసీ బస్సు రాత్రి 9గంటలకు గోదావరిఖనికి చేరుకున్నది. ఓ బ్యాగులో 10తులాల బంగారాన్ని కండక్టర్ శ్రీనివాస్ గుర్తించి డిపో మేనేజర్ నాగభూషణంకు సమాచారం అందించారు. ఇందులో ఒక నక్లెస్, చైన్, కమ్మలు ఉన్నాయి. గుర్తు తెలియని ప్రయాణికురాలు బస్సుదిగిన క్రమంలో బ్యాగును మరిచిపోయింది. ఓ నక్లెస్‌పై టీ రాయమల్లు అని పేరు రాసి ఉంది.

కేశోరాం కార్మికుల హక్కుల సాధనకు కృషి

- కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక్ హరి



నూతన అధ్యక్ష,ప్రధానకార్యదర్శులను సన్మానిస్తున్న ప్లాంట్ హెడ్, మేనేజర్

పాలకుర్తి,జూన్ 19: బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీ కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తామని కొత్తగా ఎన్నికైన గుర్తింపు సంఘం అధ్యక్షుడు కౌశిక్ హరి, ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్‌లు అన్నారు. బుధవారం వారు ప్లాంట్ హెడ్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ పి పార్థసారథి, ఇతర అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులు వారిని సత్కరించారు.

బైక్ ర్యాలీతో ఘన స్వాగతం..

నూతనంగా ఎన్నికైన కార్మిక సంఘం నాయకులు కౌశిక్ హరి, మాదాసు శ్రీనివాస్‌లకు బసంత్‌నగర్ బస్టాప్ వద్ద కార్మికులు, బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు భారీబైక్‌ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం బసంత్‌నగర్ ప్రధానవీధుల గుండా కోదండ రామాలయానికి చేరుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రధాన సమస్యలపై కార్మికులు, కంపెనీ అధికారులతో కార్మిక సంఘం నాయకులు చర్చించారు.

గాలివానకు కొట్టుకపోయిన రేకుల షెడ్డు..

కాల్వశ్రీరాంపూర్, జూన్ 19: మండలంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. భారీ ఈదురుగాలతో రహదారులపై వృక్షాలు పడిపోగా రాకపోకలకు అంతరాయం ఏర్పడ్డాయి. విద్యుత్ పోల్స్ ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చిన్న రాతుపల్లి గ్రామానికి చెందిన మ్యాదరి విజయ రేకుల షెడ్డు ఈదురుగాలులకు కొట్టుకపోయింది.గంగారం గ్రామానికి చెందిన రాచకొండ సదయ్య సెలూన్ షాప్‌పై భారీ వృక్షం పడిపోవడంతో షాపు ధ్వంసమైంది. బాధిత కుటుంబాలను మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ పరిశీలించారు. పెగడపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ వరకు ప్రధానరహదారిపై ఈదురుగాలకు భారీ వృక్షాలు పడిపోగా మాజీ ఎంపీపీ తన సొంత ఖర్చులతో రెండు జేసీబీలు ఏర్పాటుచేసి వాటిని తొలగించారు. మరమ్మతు పనులను మాజీ ఎంపీపీతో పాటు ఎస్ఐ ఓంకార్ యాదవ్ పరిశీలించారు. అటు విద్యుత్ అధికారులు సైతం సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా మరమ్మతులు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, గంగారం మాజీ సర్పంచ్ ఈద సత్యనారాయణరెడ్డి, జంగ స్వామిరెడ్డి, బాలే సమ్మయ్య, అనుముల రాజయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎలిగేడు, జూన్ 19 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలపై ప్రజలందరు అవగాహన కలిగి ఉండాలని ఐపీపీబీ సీనియర్ మేనేజర్ కొట్టె శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లోకపేట గ్రామంలో బుధవారం పోస్టాఫీసు ద్వారా ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో నాబార్డ్ ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పోస్టాఫీసు వివిధ రకాల ఇన్సూరెన్స్ పథకాల గురించి ప్రజలకు వివరంగా తెలియజేశారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అకౌంట్లు, గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్, ఇన్సూరెన్స్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవరనేని ప్రభావతి, ఉపసర్పంచ్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కలప వేలం పాట

ఓదెల, జూన్ 19: మండలంలోని కనగర్తి దాసరి పద్మ, హనుమయ్య జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కలప, టైల్స్ తదితర వాటికి 21న వేలం పాటను నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి పాఠశాల ఆవరణలోని రెండు గదులకు చెందిన 67 కలప వాసాలు, నేల టైల్స్, నేల బల్లలు, పరాట చెక్కలు తదితర వాటికి వేలంపాటను నిర్వహిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారు ఈ వేలం పాటకు హాజరుకావాలని ప్రధానోపాధ్యాయుడు కోరారు.

పాలనలో మార్పు కనిపించాలి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, జూన్ 19: మంథని మున్సిపాలిటీ నూతన పాలక వర్గం పరిపాలనలో ప్రజలకు స్పష్టమైన మార్పు కనిపించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. స్థానిక పురపాలక కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పాలక వర్గం సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రజలు ఆశించిన మార్పును చేసి చూపించాలని, దీని కోసం మనం మూడు రెట్లు కష్టపడి పని చేయాలన్నారు. ఇక నుంచి మంథని మున్సిపాలిటీ అవినీతి రహితంగా, పారదర్శకంగా పని చేయాలన్నారు. మున్సిపల్ పాలనలో దేశంలో అమలవుతున్న బెస్ట్ ప్రాక్టీస్‌లను ఇక్కడ అమలుచేయాలని, దీని కోసం స్టడీ టూర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. మున్సిపాలిటీలో అవసరం మేరకు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రజల కనీస అవసరాలు తీర్చే దిశగా వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఒక హెల్ప్‌లైన్ నెంబర్ ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్యలు, నీటి సరఫరా, మురికి కాలువ సమస్య, మొదలగు అంశాలపై ఫిర్యాదులు నమోదు చేసేందుకు దోహదపడేలా హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంథని డంపింగ్ యార్డుకు వెంటనే ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించి తరలించాలని, జనావాసాలకు దూరంగా ఉండే స్థలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలన్నారు. వానాకాలం ప్రారంభమైన తరువాత కాలువలో నీటి ప్రవాహం ఆటంకం ఉండకుండా ముందస్తుగా చెత్త తొలగించి కాల్వలు శుభ్రం చేయాలన్నారు. చెత్త తరలింపు రెగ్యులర్‌గా జరగాలని, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ రెగ్యులర్‌గా వార్డులు తనిఖీ చేయాలన్నారు. పట్టణంలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ నుంచి ప్రత్యేకంగా రూ.38 కోట్లు కేటాయించిందని, దీనికి సంబంధించి పనుల ప్రతిపాదనలను వారం, 10రోజులలోపు రూపొందించాలని, 15 రోజుల వ్యవధిలో క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కావాలని ఆదేశించారు. మంథని పట్టణం ఎంట్రెన్స్ ఆర్చ్, నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మాణం, ఆసుపత్రి నిర్మాణం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయ నిర్మాణం, సమీకృత తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి అనువైన స్థలాల ఎంపిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని మంత్రి కలెక్టర్‌ను కోరారు. పట్టణంలో వేర్వేరుగా వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పట్టణంలో పెద్ద ఎత్తున పచ్చదనం పెంచేందుకు కార్యాచరణ అమలు చేయాలని, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక డ్రైవ్ ద్వారా వారికి అవసరమైన మొక్కలు అందించి పెంచాలని, గ్రీన్ మంథని, పరిశుభ్ర మంథని సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. మంథని పట్టణ వ్యాప్తంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు.

ఈ సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, మంథని ఆర్డీవో వి.హనుమా నాయక్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ శ్రీపతి బానయ్య, మున్సిపల్ కమిషనర్ జి మల్లికార్జునస్వామి, సంబంధిత అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి రాహుల్‌గాంధీ కృషి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కేక్ కట్ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, జూన్ 19: భారత్ జూడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ దేశం మొత్తం పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పార్లమెంట్లో ప్రస్తావిస్తూ పాలకులకు కళ్లు తెరిపించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు కొనియాడారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో రాహుల్‌గాంధీ పుట్టిన రోజు సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004, 2009లో రెండుసార్లు ప్రధాన మంత్రి పదవి అవకాశం వచ్చినా రాహుల్ గాంధీ వద్దన్నా గొప్ప నాయకుడని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కృషి చేశారన్నారు. విశిష్ట గుర్తింపు ఉన్న ఆధార్ కార్డు, ఉపాధిహామీ, నిర్భయ లాంటి చట్టాలను ఆలోచన చేసిన వ్యక్తి రాహుల్ గాంధీ అన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఈ దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు



గ్రామస్తులు నిలిపివేసిన మట్టి టిప్పర్లు

ఎలిగేడు, జూన్ 19: అక్రమంగా మట్టి తరలిస్తున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని బుధవారం ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామస్థులు మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. ఓ ప్రైవేట్ రోడ్డు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణానికి నెలల తరబడి మట్టిని ఎస్సారెస్పీ డి-86ప్రధాన కాలువ వెంబడి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నాడని పలువురు గ్రామస్థులు ఆరోపించారు. కాలువకు గండ్లు పడుతాయని తద్వారా ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతింటాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థులు టిప్పర్లను నిలిపివేసి నిరసన తెలుపగా ఎస్సారెస్పీ అధికారులు వచ్చి పంచనామా చేసి పోలీసులకు అప్పగించారు.

నీటి సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి

కరీంనగర్ టౌన్, జూన్ 19: వంద ఎకరాల ఆయకట్టు ఉన్న నీటి సంఘాల కు గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికలు నిర్వహించగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదని నీటి సంఘాల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 1997లో టీడీపీ ప్రభుత్వం నీటి సంఘాలను ఏర్పాటు చేసి రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కాలపరిమితిని మూడేళ్లకు పెంచిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చినందున నీటి సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

గోపాల్‌రావుపేటలో ఏసీపీ విచారణ

రామడగు, జూన్ 19: రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో ఏసీపీ విచారణ చేపట్టారు. ఈసందర్భంగా బుడగ జంగాల యువకులను కులం పేరుతో గౌడ కులస్తులు దూషించారని ఫిర్యాదు చేయడంతో ఏసీపీ విచారణ జరిపారు. అయన వెంట రామడుగు ఎస్ఐ సురేందర్, తదితరులు ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ సురేష్ బాబు

కోరుట్ల, జూన్ 19: కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన కోట రాజేష్ హత్య కేసులో ఎనిమిది మంది నిదుతులను అరెస్టు చేసినట్లు కోరుట్ల సీఐ సురుష్ బాబు బుధవారం తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు సంబదించిన వివరాలను సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్‌తో వెల్లిడించారు. రాజేష్ తన తమ్ముడు రాకేష్‌తో పాటు కుటుంబ సభ్యులకు గ్రామంలో అస్తి తగాద ఉంది. రాజేష్ వివాదంలో ఉన్న భూమిలో కొన్ని రోజుల క్రితం బాత్ రూంలు కట్టడంతో మరింత వివాదం ముదిరింది. విషయంపై కుటుంబసభ్యులు, తమ్ముడు రాకేష్ తన మిత్రుడు లింగపల్లి నరేష్ రాజేష్‌ను ప్రశ్నించారు. దీంతో ఘర్షణ చోటుచేసుకోగా రాజేష్‌పై తమ్ముడు రాకేష్ కత్తితోదాడి చేశారు. అలాగే స్నేహితుడు లింగంపల్లి నరేష్ తండ్రి గంగారాజం, భార్య కోట మాసన, అతని చిన్నమ్మలు కోట మల్లు, మంచాల లక్ష్మి, బాబాయిలు కోట గంగారాజం, మాంచాల రాజేశం దాడి చేసినట్లు గుర్తించి రాజేష్ భార్య లాస్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు మోహరావుపేట, మేడిపల్లి మండలం వల్లంపల్లి గ్రామాల్లో ఉన్నట్లు సమాచా రం అందగా అక్కడి వెళ్లి వారిని కోరుట్ల ఎస్ఐ కిరణ్‌కుమార్ అరెస్టు చేసి కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినుట్ల సీఐ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారంగాపూర్, జూన్ 19: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరు యజమాని, డ్రైవర్‌పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి ట్రాక్టరును సీజ్ చేశారు. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల ప్రకారం ఆరెపల్లి నుంచి జగిత్యాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సారంగాపూర్ అటవీ ప్రాంతంలో పోలీసులు పట్టుకుని ట్రాక్టరును స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఆరెపల్లికి చెందిన దర్శనాల సిద్దు, పిస్క వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

జమ్మికుంట రూరల్, జూన్ 19: రాష్ట్రంలో ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు అండగా ఉండాలని అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజుల దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని నీట్ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామరావు వెంకటేష్, నాయకులు అలువాల విష్ణు, అనిల్ కుమార్, తౌకిర్ అనిల్ రెడ్డి, సాయి, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పొగతో ఇక్కట్లు


మెట్‌పల్లిలోని డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ

● ఉక్కిరిబిక్కిరి అవుతున్న రైతులు

మెట్[illegible] 19: [illegible] పాలక సంఘం పరిధిలోని పట్టణ శివారు డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగలతో జనం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పట్టణం శివారులోని గోదూరు రోడ్డులోని డంపింగ్‌యార్డుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. డంపింగ్‌కు సమీపంలోని వ్యవసాయ పొలాలలో పనిచేసే రైతులుకు కుళ్లిపోయిన చెత్తతో దుర్వాసన వెదజల్లుతోందంటున్నారు. డంపింగ్ యార్డులోని చెత్తకు సిబ్బంది మంట పెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో అక్కడ అప్పుడప్పుడు మంటలు ఎగిసిపడుతున్నాయి. పలుమార్లు సిబ్బందికి సూచించినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గాలి ఎక్కువగా వీస్తున్న సమయంలో ఈ దట్టమైన పొగలు ఆప్రాంతమంతా కమ్ముకొని పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు దగ్గర డంపింగ్ యార్డు ఏర్పాటు చేసిన దానిలో రోజు పట్టణంలో సేకరించిన చెత్తను అక్కడ వేయడం వలన పొలాల్లో పని చేసే రైతులకు దుర్వాసన వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లే రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఏమిచేయాలో తెలియక ప్రజలు, రైతులు మురికిలోనుంచి పొలాలకు వెళ్తున్నారు. బుధవారం డంపింగ్ యార్డుకు నిప్పంటించడంతో రైతులు, వాహనదారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. చెత్తకు నిప్పంటిస్తుండడం తో ఆ ప్రాంతమం తా దట్టమైన పొగలు నిండుకుని సమీపంలోని రైతులు, వాహనదారులు పీల్చుకోవడం వల్ల దగ్గు, ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయంటున్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మంటలు ఆర్పుతామంటారే కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురు అదృశ్యం?

● లబోదిబోమంటున్న బాధితులు

హుజూరాబాద్, జూన్ 19: హుజూరాబాద్‌లో నెలరోజుల్లో ముగ్గురు వ్యక్తులు ఆర్థిక ఇబ్బందులతో అదృశ్యం కావడంతో డబ్బులు ఇచ్చిన బాధితులు లబోదిబోమంటున్నారు. హుజూరాబాద్ పట్టణంలో గత 20ఏళ్లుగా ఓ వ్యక్తి రాజకీయంలో ఉంటూ ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం నిర్వహించాడు. ఇతనిని నమ్మిన కొంత మంది చిట్టీలు వేయగా, వడ్డీ వస్తుందనే ఉద్దేశ్యంతో దాచుకున్న డబ్బులను సుమారు రూ. కోటి వరకు ఇచ్చారు. ఆ వ్యక్తి ఇటీవల భార్య పిల్లలతో కనబడకుండా పోయాడు. ఇదిలా ఉండగా, పట్టణంలోని కర్నాటకు చెందిన ఓ బేకరి యజమాని కొంత మంది దగ్గర సుమారు రూ. 20లక్షల వరకు అప్పుచేసి కుటుంబంతో పారిపోయాడు. అతని కోసం బాధితులు కర్నాటకకు కూడా వెళ్లి వచ్చినట్లు సమాచారం. అలాగే పట్టణంలోని ఓ రిటైర్డ్ ఉద్యోగి కొడుకు వ్యాపారం చేసి అప్పులు కావడంతో, తెలుసుకున్న తండ్రి నెల రోజులుగా కనబడకుండా పోవడంతో కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పైముగ్గురు వ్యక్తులది ఆర్థిక వ్యవహారాల కారణం కావడంతో హుజూరాబాద్ పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

బీసీస్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 అభ్యర్థులకు గ్రాండ్ టెస్ట్‌లు

గణేశ్‌నగర్,జూన్ 19: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ -2 గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో జూలై 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్షలు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో జూలై 8,9,15,16,22,23,30,31, తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు అలాగే, మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టెస్టులను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రత్యేక కార్యాచరణ

- మంథనిలో కోకోకోలా ప్లాంట్ - మినీ ఐటీ సెంటర్‌ను ఏర్పాటుకు కృషి - రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, జూన్19: మంథని నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి మంథని ప్రాంతంలో కోకోకోలా కంపెనీ ప్లాంట్‌ను ఏర్పాటు చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బా బు వెల్లడించారు. స్థానిక జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో బుధవారం నిర్వహించిన బడిబాట ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఆమెరికా పర్యటనలో కోకోకోలా కంపెనీ ప్రతినిధులను కలిసి రాష్ట్రంలో పరిశ్రమ స్థాపనకు ముందుకు రావాలని కోరాగా వారు తమ ప్లాట్‌ను మంథనిలో ఏర్పాటు చేయటానికి హామీ ఇచ్చారన్నారు. కోకోకోలా ప్లాంట్‌ను ఏర్పాటు చేయటానికి మంథని మండలంలోని అడవిసోమన్‌పల్లి, సిరిపురం తోపాటు పెద్దపల్లి జిల్లాలోని మరో రెండు ప్రాంతాలను కంపెనీ ప్రతినిధులు తమకు అనువైన స్థలం కోసం పరిశీలిస్తున్నారన్నారు. త్వరలోనే ప్లాంట్‌ను ఏర్పాటు చేయించి మంథని ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. మంథని-శివ్వారం మధ్య గోదావరినదిపై రూ. 120 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతామన్నారు. మరో పదిహేను రోజుల్లో సంబంధిత శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో గోదావరినదిపై బ్రిడ్జి నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయిస్తామన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో మంచిర్యాల-పెద్దపల్లి జిల్లా అనుసంధానంతో ప్రజలకు రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. మంథనిలో ఒక చిన్న ఐటీ సంస్థ సైతం అతి త్వరలో ఏర్పాటు కాబోతుందని, తొలి విడితలో 50 మంది యువతకు నెలరోజుల లోపు ఉపాధి కల్గుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక అవసరాలు కల్పించే దిశగా ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకున్నామన్నారు. పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. పెద్దపల్లి జిల్లాలో రూ.30 కోట్లతో 478 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా సాధికారత మాటలకే పరిమితం కాకుండా చేతలు కూడా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అందులో భాగంగా ఆర్టీసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన బాధ్యతలు అప్పగించామన్నారు.

మార్కెట్‌లో వచ్చే కొత్త కోర్సులు, ట్రెండ్స్ నైపుణ్యాలు విద్యార్థులకు అందించడం కోసం ఐటీఐలను ఆధునీకరిస్తున్నామన్నారు. 65 అడ్వాన్స్ లెర్నింగ్ కేంద్రాలను దాదాపు 2,234 కోట్ల రూపాయలతో టాటా కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాటారం ఐటీఐలో ఆరు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఉత్తీరణత శాతాన్ని పెంచడానికి నాణ్యమైన విద్యను ఉపాధ్యాయుల ద్వారా అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ, ఆర్డీవో హనుమానాయక్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, జడ్పీటీసీ తగరం సుమలత, సింగిల్‌విండో ఛైర్మన్ కొత్త శ్రీనివాస్, డీఈవో మాధవి, డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, పీఈటీ డాక్టర్ దొమ్మటి రవి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

మేడిపల్లి, జూన్ 19: మండలంలోని దేశపేట గ్రామానికి చెందిన కురుమళ్ల సతీష్(31) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సతీష్ కొద్దిరోజుల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. అయితే అక్కడ ఉపాధి లభించకపోవడంతో ఏం చేయాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. మరోవైపు గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్రమనస్తాపానికి గురైన సతీష్ జీవితంపై విరక్తి చెంది బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సతీష్ భార్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

బావిలో మహిళ మృతదేహం లభ్యం

సుల్తానాబాద్, జూన్ 19: సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో నిర్మల(38) అనే మహిళ మృతదేహం బావిలో బుధవారం లభ్యమైంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నీరుకుళ్ల గ్రామానికి చెందిన నిర్మలకు చాలాకాలం నుంచి సంతానం కలుగలేదు. దాంతో అమె మానసికంగా అవేదన చెందుతోంది. కొన్ని రోజుల క్రితం ఆపరేషన్ కూడా జరగడంతో ఇంకా మానసికంగా కుంగిపోయింది. బుధవారం ఉదయం నుంచి తన భార్య కనిపించకుండా పోవడంతో భర్త ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అంతటా వెతికారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. మధ్యాహ్నం ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో నిర్మల మృతదేహం లభ్యమైంది. నిర్మల మృతిపై బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రేపు సంగీత విభావరి

కరీంనగర్ కల్చరల్, జూన్ 19: ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా నగరంలోని ఫిలింభవన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 10 జిల్లాల కళాకారుల సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సల్వాజి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత విద్వాంసులకు, గురువులకు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కళాకారులు, కళాభిమానులు, కళా పోషకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందికి సన్మానం


ఆర్టీసీ సిబ్బందిని సన్మానిస్తున్న ఎండీ సజ్జనార్

భగత్‌నగర్, జూన్19: కరీంనగర్ బస్‌స్టేషన్‌లో మహిళకు పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందిని బుధవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆర్టీసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ సత్కరించారు. ఈనెల 16 ఆదివారం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఒడిశా రాష్ట్రానికి చెందిన గర్భిణి కుమారికి పురిటి నొప్పులు రాగా ఆర్టీసీ సిబ్బంది బస్‌స్టేషన్‌లో పురుడు పోశారు. బస్‌స్టేషన్‌లో మహిళ ప్రసవానికి సహకరించి పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బంది సైదమ్మ, రేణుక, భవాణి, లావణ్య, బస్‌స్టేషన్ ట్రాఫిక్‌మేనేజర్ రజనీకృష్ణ, స్టేషన్ మేనేజర్ నోముల అంజయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వి రవీందర్, జాయింట్ డైరెక్టర్ (విజిలెన్స్) అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) పివి మునిశేఖర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) ఎస్‌కృష్ణకాంత్, చీఫ్ పర్సనల్ మేనేజర్ ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.

● చిన్నారికి ఆర్టీసీ జీవితకాలపు ఉచిత బస్‌పాస్

ఈనెల 16న ఆదివారం కరీంనగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బస్‌స్టేషన్‌లో జన్మించిన చిన్నారికి ఆర్టీసీ జీవితకాలపు ఉచిత బస్ పాస్‌ను సంస్థ ప్రకటించింది. గతంలో ఆర్టీసీ బస్సులు, బస్‌స్టేషన్‌లో పుట్టిన పిల్లలకు జీవితకాలపు ఉచిత బస్‌పాస్ ఇవ్వాలనే యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు ఆదివారం కరీంనగర్ బస్‌స్టేషన్‌లో జన్మించిన ఆడపిల్లకు బర్త్‌డే గిఫ్ట్‌గా ఉచిత బస్‌పాస్‌ను మంజూరు చేస్తున్నట్లు సంస్థ యాజమాన్యం తెలిపింది.

జీపీఎఫ్ ఖాతాల్లోని నిధుల మాయంపై విచారణ


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాల టౌన్, జూన్ 19 : జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో పనిచేసే ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లోని నిధులు మాయంపై బుధవారం నిజామాబాద్ జిల్లా బాన్స్‌వాడ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రి ఆవరణలో ఉన్న వైద్య విధాన పరిషత్ కార్యాలయంలో బుధవారం రోజంతా విచారణ కొనసాగింది. రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాసిన్ అనే ఉద్యోగి వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల డీఏ ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్, వివిధ డిడెక్షన్లకు సంబంధించిన నిధులను వారి ఖాతాల్లో జమ చేయకుండా సుమారు రూ.50 లక్షలకు పైగా పక్కదారి పట్టించగా విచారణలో నిజమని తేలడంతో యాసిన్‌ను సస్పెండ్ చేశారు. దీంతో బుధవారం బాన్స్‌వాడ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. వైద్య విదాన పరిషత్ ఖాతాకు సంబంధించి జారీ చేసిన ఓచర్లు, చెక్కులు తదితర రికార్డులను హైదరాబాద్ నుంచి వచ్చిన ఇద్దరు ఆడిటర్స్ పరిశీలించారు. యాసిన్ మూడు చెక్కులకు సంబంధించిన ఓచర్లను మాయం చేసినట్లు గుర్తించారు. దారి మళ్లించిన నిధుల నుంచి రూ. 40 లక్షలను ఖాతాలోకి జమ చేయించారు. మిగతా నిధులు రికవరితో పాటు రెండు, మూడు సంవత్సరాల లావాదేవీలకు సంబందించిన ఓచర్లను ఆడిటర్స్ పరిశీలిస్తున్నట్లు విచారణ అధికారి వివరించారు.

● బయట పడుతున్న రికార్డ్ అసిస్టెంట్ బాగోతం...

జగిత్యాల వైద్యవిదాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి డీఏ ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్ నిధులు పక్కదారి పట్టించిన రికార్డు అసిస్టెంట్ యాసిన్ అవినీతి బాగోతం బుధవారం మరిన్ని వెలుగులోకి వచ్చాయి. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో 11 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న బాబర్ అనే వ్యక్తిని నమ్మించి పర్సనల్ లోన్ ఇప్పిస్తానని చెప్పి ఐదు లక్షల రూపాయలు, థియేటర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివ గంగాధర్ అనే వ్యక్తి వద్ద పర్సనల్ లోన్ ఇప్పిస్తానని 15 లక్షల రూపాయలు తీసకుని మోసాలకు గురిచేసినట్లు బాధితులు విచారణ అధికారికి ఫిర్యాదు చేశారు. యాసిన్ నుంచి డబ్బులు రికవరీ చేయించాలని వేడుకున్నారు. ఇలా యాసిన్ బాగోతాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి.



జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు



గోదావరిఖనిలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సుల్తానాబాద్‌లో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

పెద్దపల్లిటౌన్, జూన్ 19: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పరస్కరించుకొని స్థానిక బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడార్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కోఆర్డినేటర్ కమ్మరగోని చౌదరి గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కీర్తి రాజయ్య, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల ప్రవీణ్, పెద్దపల్లి మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరగొండ రాజ్ కుమార్, రంగాపూర్ గ్రామ శాఖ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బొడ్డుపల్లి అశోక్, కాంగ్రెస్ నాయకులు గుర్రాల రాజు, దాసరి కిషన్, కొత్తపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండి సుకుర్, పొగాకుల సదయ్య, రెడ్డిమల్ల రమేష్, నెరేళ్ల విజయ్, రొడ్డ దేవేందర్, గుర్రాల వాసు, కనుకుల సదయ్యకాంగ్రెస్ నాయకులు అబ్దుల్లా, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు

గోదావరిఖనిలో..

కళ్యాణ్‌నగర్, జూన్ 19: బడుగు, బలహీనవర్గాలకు అండగా రాహుల్ గాంధీ ఉన్నాడని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, కార్పొరేటర్ మహంకాళి స్వామి అన్నారు. రాహుల్‌గాంధీ 55వ జన్మదిన సందర్భంగా గోదావరిఖని చౌరస్తాలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో జోడో యాత్ర పేరుతో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వారికి ధైర్యాన్ని ఇచ్చిన వ్యక్తి రాహుల్ గాంధీ అన్నారు. రానున్న రోజుల్లో రాహుల్‌గాంధీని దేశ ప్రధానిగా చేయడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోట సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాదరబోయిన రవికుమార్, దీటి బాలరాజు, బొమ్మక రాజేష్, నాయిని ఓదెలు, కార్పొరేటర్ ఎండీ ముస్తాఫా, నాజీమోద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, గట్ల రమేష్, గడ్డం శ్రీనివాస్, కీర్తి నాగరాజు, ఐలయ్య, శ్యాంసుందరచారి పాల్గొన్నారు. అమ్మపరివార్ అనాథ ఆశ్రమంలో కంకణాల మౌనికరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కుమారుడు ప్రతీక్ ఠాకూర్ హాజరై కేక్ కట్ చేసి అనాథ పిల్లలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాదరబోయిన రవికుమార్, కౌటం సతీష్, బాదం వసంత, రవి, నజీమ్, దూళికట్ట సతీష్, మీసాల కృష్ణ, విశాల్, ఓదెలు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీలో...

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 19: కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని బుధవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, కార్పొరేటర్ సాగంటి శంకర్, నాయకులు జక్కుల దామోదర్‌రావు, చక్రపాణి, వై తిరుపతి, అనుము రాములు, తిరుపతి రెడ్డి, సారయ్యనాయక్, అవినాష్, అఫ్సర్, రాకేష్ పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 కార్యాలయంలో ఏరియా వైస్‌ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి, జూన్ 19: మండలం పరిధిలోని బసంత్‌నగర్ టోల్ ప్లాజా వద్ద డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య అధ్యక్షతన, పుట్నూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి వేల్పుల రాజ్ కుమార్ అధ్యక్షతన బుధవారం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ దేశంలో యువతకు ఆదర్శమని, రానున్న రోజుల్లో భారత ప్రజాస్వామ్యానికి దిక్సూచిగా నిలుస్తారన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్ర ద్వారా అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి వారికి ప్రజాస్వామ్య పరిరక్షణ పట్ల భరోసా కల్పించారన్నారు. బసంత్‌నగర్ మాజీ సర్పంచ్ కట్టెకోల వేణుగోపాల్‌రావు, పాలకుర్తి మాజీ సర్పంచ్ దుర్గం జగన్, నాయకులు పాత రవిందర్, ఆరుకల సతీష్, మొహమ్మద్ ఇబ్రహీమ్, శంకర్ నాయక్, భూతగడ్డల రమేష్, ఎరుకల సాగర్ గౌడ్, మేకల గోవర్ధన్, శ్రీకాంత్, బొంగోని మల్లేష్, సంటి శంకర్, దాసరి సాగర్, బోదాసు శంకర్, భూర్ల నారాయణ, జల్లి మల్లేష్,నార సత్తయ్య, నార శంకర్ తదితరులతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్, జూన్ 19: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్ కట్టింగ్ చేసి రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామగిరిలో..

రామగిరి, జూన్ 19: మండలంలోని తెలంగాణ, ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు బాపన్న, ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొటరవీందర్ రెడ్డి, పి.వి గౌడ్, ముస్త్యాల శ్రీనివాస్, గంట వెంకటరమణరెడ్డి, మల్లేష్, ఉడుత శంకర్, వెము కనకయ్య, భూమయ్య, ముచ్చకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెలలో..

ఓదెల, జూన్ 19 : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నాయకులు నిర్వహించారు. ఆలయంలో రాహుల్ పేరిట అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులకు సీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండేటి ఐలయ్య, నాగపూరి రవీందర్ గౌడ్, గాజుల శివశంకర్, చింతకుంట వెంకటరెడ్డి, తొట్ల రాములు, భోగి సురేష్, తాత ఐలయ్య, తొట్ల కృష్ణ, శ్రీనివాస్, మాటూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్, జూన్ 19: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి రాహుల్ గాంధీ అని కొనియాడారు. రాహుల్ గాంధీ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండి రాబోవు రోజుల్లో దేశ ప్రధానిగా అవుతాడని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్, జూన్ 19: కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు స్థానిక ఐబీ చౌరస్తా వద్ద రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మినుపాల ప్రకాశరావు, గాజుల రాజమల్లు, కల్లెపల్లి జానీ, శ్రీగిరి శ్రీనివాస్, పన్నాల రాములు, రాజలింగం, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అబ్బయ్య గౌడ్, మండల శాఖ అధ్యక్షులు చిలుక సతీష్, ఇల్లెందుల శ్రీనివాస్ గౌడ్, సాయిరి మహేందర్, ముస్త్యాల రవీందర్, తిరుపతి, కిషోర్, రఫీ, తాహెర్, దూడం ప్రకాష్, నోముల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమాన్‌పూర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాల్వశ్రీరాంపూర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు



పాలకుర్తిలో..

ధర్నాను విజయవంతం చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 19: కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఇఫ్టూ నాయకులు నరేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని తెలిపారు.

ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలైన సింగరేణి, ఎన్‌టీపీసీలతో పాటు కేజీబీవీలో నాన్ టీచింగ్ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని నరేష్ అన్నారు. ఏళ్ళ తరబడి పనిచేస్తున్నా క్రమబద్దీకరణకు నోచుకోలేదని, న్యాయమైన వేతనాలు సైతం అందడం లేదని పేర్కొన్నారు. కలెక్టరేట్ ధర్నాలో అధిక సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొనాలని నరేష్ పిలుపు నిచ్చారు. ఈసమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, నాయకులు అశోక్, పద్మ, మేరీ, సమ్మక్క, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నుంచి ఇసుక రవాణాకు చెక్

-డంప్‌లను సీజ్ చేసిన పోలీసులు



ఇసుక దంపులను పరిశీలిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, జూన్ 19: గోదావరి నది నుంచి ఇసుక అక్రమ రవాణాకు పోలీసులు చెక్ పెట్టారు. బుధవారం సాయంత్రం గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఓసీపీ-4 రోడ్‌లో తనిఖీ చేసి ఇసుక దంపులను గుర్తించారు. రెవెన్యూ అధికారులు 42లోడ్‌ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. గోదావరి నది నుంచి రాత్రి పూట ఇసుకను తీసి డంప్ చేస్తున్నట్టు గుర్తించారు. గోదావరినది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేయడమే కాకుండా డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. నిర్మాణదారులు సాండ్ పాలసీని వినియోగించుకోవాలని, ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేస్తే నేరుగా ఇంటికే వస్తుందన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఓదెల, జూన్ 19: మండలంలోని కొలనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన రోహిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రాజెక్ట్ ఐరన్ హెల్త్ చిల్డ్రన్‌లో భాగంగా విద్యార్థులందరికీ హిమోగ్లోబిన్, దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులను, టూత్ బ్రష్, పేస్టు లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాయి శృతి, విదేప,హైందవి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏసుదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

పెద్దపల్లిటౌన్, జూన్19: సుల్తానాబాద్ మండలంలో బాలికపై హత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు బూర్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బాలికపై హత్యాచారం జరిగితే స్థానిక ప్రజాప్రతినిధి బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కంది శ్రీనివాసుతో కలిసి ఆయన మాట్లాడుతూ హత్యాచారాన్ని ఖండించారు. మంత్రులు పరామర్శించే వరకు స్థానిక ప్రజాప్రతినిధి ఘటనపై కనీసం విచారం సైతం వ్యక్తం చేయకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బంక రాజేష్, గీట్ల శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నరు.

పాఠశాల ఎదుట ఆందోళన

కోల్‌సిటీటౌన్, జూన్ 19: నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం గోదావరిఖని ఆర్ఎఫ్‌సీఎల్‌లోని ఓ ప్రైవేటు స్కూల్ ఎదుట బీజేపీ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రామగుండం నియోజవర్గ కోఆర్డినేటర్ కొండపర్తి సంజీవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం, మామిడి మణికంఠ, పూసాల మహేష్, వంశీ, ఏబీవీపీ నాయకులు పిడుగు సిద్ధార్థ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

సుల్తానాబాద్, జూన్ 19: సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న పలువురు కాంట్రాక్టు ఉద్యోగులకు ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదని, వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ కోరారు. ఈ మేరకు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ మహేందర్‌కు బుధవారం కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులతో కలిసి వారు విలేకరులతో మాట్లాడుతూ సుల్తానాబాద్ ఆస్పత్రిలో పద్నాలుగు మంది కాంట్రాక్ట్ పద్ధతిన ఏజెన్సీ ఆధ్వర్యంలో పని చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని వెంటనే పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల జీతాలను వెంటనే ఇప్పించాలని అవి కూడా నెలకు పదిహేను వేల ఐదు వందల చొప్పున ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాధా, రమేష్, రాకేష్, అనిల్, రమ్యశ్రీ, సునిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూలో దోస్త్ రెండో విడత సీట్ల కేటాయింపు పూర్తి

గణేశ్‌నగర్, జూన్ 19: శాతవాహన విశ్వవిద్యాలయంలో దోస్త్ రెండో విడత సీట్ల కేటాయింపు పూర్తి అయినట్లు ఎస్‌యూ దోస్త్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సూరపల్లి సుజాత తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో దోస్త్ రెండో విడత సీట్లలో ఉన్నత విద్యా మండలి శాతవాహన యూనివర్సిటీ పరిధిలో మొత్తం 2,743 సీట్లను కేటాయించింది. ప్రభుత్వ కళాశాలలో 323 మంది విద్యార్థులకు, రెండు ప్రభుత్వ అటానమస్ కళాశాలల్లో 753మంది విద్యార్థులకు, ప్రైవేటు కళాశాలలో 1667 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. రెండో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని దోస్త్ కోఆర్డినేటర్ తెలిపారు.

పీజీ ఈసెట్‌లో శాతవాహన విద్యార్థుల ప్రతిభ

గణేశ్‌నగర్, జూన్19: యం.ఫార్మసీ ప్రవేశాల కోసం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పీజీ ఈసెట్ ఎంట్రన్స్‌లో శాతవాహన విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం తెలిపారు. ఈ పరీక్షలో జి.నందిని 6వ ర్యాంకు, యం సాయికిరణ్ 26, ఏ రమ్య 29, జి ప్రత్యూష 46, శివాని 54, పల్లవి63, వై స్నేహ 67, ఎం ప్రవళిక 75, బి హరీష్ 108, పి సౌమ్య 128, పి సాయి పూజిత 148, ఏ లోకేశ్ 165, జి స్రవంతి 174 ఎస్ జగదీష్ 183, ఎం భానుమతి 191, డి మేఘన 208, ఎం హరిణి 228, కె శివరాములు 231, ఎల్ ప్రణతి 272, సంధ్యారాణి 284, ఎన్ ఆదిత్య 328వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ఉపకులపతి సురేంద్ర మోహన్, రిజిస్ట్రార్ వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్ అభినందించారు.

రెస్టారెంట్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు

కరీంనగర్ క్రైం, జూన్ 19 : కరీంనగర్‌లో ఫుడ్‌సేఫ్టీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం పలు రెస్టారెంట్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ సునీత, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో కేఎఫ్‌సీ, అరేబియన్ మండి రెస్టారెంట్, మహారాజా బార్ అండ్ రెస్టారెంట్‌లను ఆకస్మికతనిఖీలు చేశారు. ఈ తనిఖీలో భాగంగా కొన్ని అనుమానిత నమూనాలు సేకరించి ల్యాబ్‌కి పంపించారు. కొన్ని నిల్వ చేసిన ఆహార పదార్థాలను పారవేశారు. పరిశుభ్రత లేని కారణంగా రెస్టారెంట్, హోటల్ నిర్వాహకులకు నోటీసులను జారీ చేశారు. ఇకనుంచి ఆహార వ్యాపార నిర్వాహకులు సరైన పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోతే చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

- డీఎంఎస్ మెకానికల్ సుధీర్ గన్‌పత్‌రావ్ బైసరే



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధీర్ గన్‌పత్‌రావ్ బైసరే

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 19: భారీ యంత్రాల్లో ప్రమాదాలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని డీఎంఎస్(మెకానికల్) సుధీర్ గన్‌పత్‌రావ్ బైసరే అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌సీఓఏ క్లబ్‌లో రామగుండం, బెల్లంపల్లి రీజియన్ అధికారులకు హెచ్‌ఈఎంఎం, సీహెచ్‌పీల పనితీరు, రక్షణపై ఒకరోజు వర్క్‌షాప్ కార్యక్రమం జరిగింది. భారీ యంత్రాల పనితీరు, సీహెచ్‌పీల పనితీరు, వాటిలో లోటుపాట్లు, చేయాల్సిన మార్పులు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై డీఎంఎస్ అధికారులు వివరించారు. మానవ తప్పిదాలను తగ్గించడానికి యంత్రాల్లో ఏర్పాటు చేయాల్సిన రక్షణ పరికరాలు, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడంలో ఉద్యోగులు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై కూలంకుశంగా చర్చించారు. ఉద్యోగులు తప్పనిసరిగా రక్షణ సూత్రాలు పాటించేలా శ్రద్ధ చూపాలని, పైస్థాయి అధికారులు అనుసరించాల్సిన రక్షణ విధివిధానాలపై చర్చించారు. ఈసందర్భంగా అధికారులు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ల నుండి సలహాలు, సూచనలను డీఎంఎస్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఇంజనీర్లు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్లు ప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఉద్యోగులు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూల్‌బుక్‌లో తెలియజేసిన విధంగా రక్షణ సూత్రాలు పాటిస్తూ, రక్షణ పరికరాలు ధరించే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదని సింగరేణి సేఫ్టీ జీఎం గురువయ్య పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో దిలీప్‌కుమార్(డీడీఎంఎస్, మెకానికల్), ఆర్జీ-2,1,3 జీఎంలు సూర్యనారాయణ, సీహెచ్ శ్రీనివాస్, సుధాకర్‌రావు, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ జీఎంలు రవిప్రసాద్, సంజీవరెడ్డి, రామగుండం రీజియన్, బెల్లంపల్లి రీజియన్‌ల సేఫ్టీ జీఎంలు కే హెచ్ఎస్ గుప్తా, రఘుకుమార్‌లతోపాటు సేఫ్టీఆఫీసర్లు, మెకానికల్ ఫోర్‌మెన్లు, మెకానికల్ ఇంజనీర్లు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ ట్రైనీ నైపుణ్య పరీక్షలు

రామగిరి, జూన్ 19: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో రెండవరోజు ఈపీ ఆపరేటర్ ట్రైనీ నైపుణ్య పరీక్షలను బుధవారం నిర్వహించారు. ఆర్జీ-2,3 డివిజన్లకు చెందిన 120 మంది అభ్యర్థులకు 111మంది అభ్యర్థులు హాజరైనట్లు కమిటీ చైర్మన్ రఘుపతి తెలిపారు. గురువారం సైతం పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకుందాం..

- కార్మిక సంఘాల జేఏసీ ఏర్పాటు చేస్తాం - టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, జూన్ 19: బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియను అడ్డుకొని సింగరేణిని కాపాడుకుందామని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం బొగ్గు బ్లాకులతో పాటు, ఇతర ఏ ఖనిజ నిల్వలను కూడా వేలంవేయకుండా కాపాడిన విషయాన్ని కార్మికులు గమనించాలన్నారు. బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియలో పాల్గొనాలని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నదని, అందుకు సింగరేణి యాజమాన్యం వంత పాడుతోందని ఆయన విమర్శించారు. సింగరేణిలో ప్రైవేటీకరణను ఎట్టి పరిస్థితుల లో అనుమతించబోమని గత అసెంబ్లీ, సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చి గెలుపొందిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాలు కూడా బొగ్గు బ్లాకుల వేలం పాటలో సింగరేణి సంస్థ పాల్గొనాలని ప్రచారం చేస్తున్న తీరును కార్మికులు గమనించాలన్నారు. తెలంగాణలోని బొగ్గు బ్లాకుల వేలంపాటలో సింగరేణి సంస్థకు కాకుండా ప్రైవేట్ వ్యక్తులకు బిడ్డింగులో బొగ్గు బ్లాకు దక్కితే చాలా కష్టాలు ఎదుర్కోవలసి వస్తుందని ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఓపెన్ కాస్టు గనులలో ఓవర్ బర్డెన్ తొలగింపు పనులు నిర్వహిస్తున్న ప్రైవేట్ కంపెనీలలో పని చేసే కార్మికులకు ఇస్తున్న జీతాలు, కల్పిస్తున్న సౌకర్యాలను ఒక్కసారి పరిశీలించాలని ఆయన కోరారు. కార్మికుల శ్రమను దోచుకుని కాంట్రాక్టర్లు బాగుపడతారు తప్ప ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన తెలిపారు. ఇటీవల కాలంలో కొత్తగా ఉద్యోగాలలో చేరిన 20వేల మంది కార్మికుల భవిష్యత్తు కూడా గందరగోళంలో పడుతుందని హెచ్చరించారు. విశాల ప్రయోజనాల దృష్ట్యా సింగరేణి గుర్తించిన బొగ్గు బ్లాకులను సంస్థకే అప్పగించే విధంగా కార్మిక సంఘాలు పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు. కలిసివచ్చే కార్మిక సంఘాలతో ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసి బొగ్గుబ్లాకుల వేలానికి వ్యతిరేకంగా పోరాడుతామని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి కేంద్ర బొగ్గు గనులు, ఖనిజాల శాఖ మంత్రిగా కొనసాగుతున్న జీ కిషన్‌రెడ్డిని కలిసి సింగరేణి సంస్థకే తెలంగాణలోని బొగ్గు బ్లాకులను ఇవ్వాలని కోరుతామని తెలిపారు. విలేకరుల సమావేశంలో కార్మిక నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, పర్లపల్లి రవి, కే సురేందర్‌రెడ్డి, పెట్టం లక్ష్మణ్, పల్లె సురేందర్, పులిపాక శంకర్, భేతి చంద్రయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 19: సెక్టార్-3 సింగరేణి ఉన్నత పాఠశాలలో తాత్కాలిక బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి అర్హుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆర్జీ-2 అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. బయాలజీ-1, సోషల్ స్టడీస్-1 ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూనియర్ అసిస్టెంట్-2, అటెండర్-1 పోస్టులకు అర్హత అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులు పూర్తి వివరాలతో ఈనెల 24తేదీలోపు పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

దుమ్ము నివారణకు కృషి

శ్రీరాంపూర్, జూన్ 19:కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో దుమ్ము నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు జీఎం బి సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో డస్ట్ సప్రెషన్, ఫైర్ ఫైటింగ్ సిస్టమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తం రెడ్డి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

స్ట్రక్చర్ సమావేశాలు ఏర్పాటు చేయాలి

- ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రామగిరి, జూన్ 19: కార్మికుల సమస్యల పై స్ట్రక్చర్ సమావేశాలు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల మాదిరిగానే సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందన్నారు. గుర్తింపు పత్రం వెంటనే అందించి స్ట్రక్చర్ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. కోల్‌ఇండియా మాదిరిగానే సింగరేణిలో పెర్క్స్, ఇన్‌కంటాక్స్ రీయింబర్స్‌మెంట్ కల్పించాలన్నారు. సింగరేణిలో గతంలో మాదిరిగానే ప్లేడేలు, పీహెచ్‌డీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ సెలబస్ ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు స్వంత ఇంటి పథకం అమలుచేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, సమ్మయ్య, రాజేష్, రాజయ్య, గంగాధర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.